క్లుప్తంగా

సాధనతో క్రీడల్లో రాణింపు



తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు

కర్నూలు (టౌన్): విద్యార్థులు కఠోర సాధన చేస్తే క్రీడల్లో రాణించగలుగుతారని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక యునైటెడ్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో బెల్టు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండో క్రీడ ఒలింపిక్ సంఘం గుర్తించిన క్రీడ అన్నారు. గుర్తింపు ఉన్న క్రీడల్లో సాధన చేసి ప్రతిభ చాటడం ద్వారా విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను స్పోర్ట్స్ కోటా కింద పొందవచ్చునన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బాల గంగాధర్ రెడ్డి బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయకులు

కర్నూలు కల్చరల్: పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఘంటసాల సంగీత విభావరి నిర్వహించారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన పరమపదించి 50 సంవత్సరాలు అయినా ఘంటసాల పాటలకు ఇప్పటికీ ఆదరణ తగ్గలేదని వక్తలు పేర్కొన్నారు. గాయకులు షేక్ ఖాదర్ బాషా, షేక్ హబీబ్, రాధిక, సంగీత బృందం శ్రీనివాసులు, రమ ణయ్య ఆలపించిన పాటలు అలరించాయి. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, సభ్యులు గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఆందోళన



చికిత్స పొందుతున్న షేక్ ఆసియా (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): మహిళ తీవ్ర అనారోగ్యంతో మృతి చెందడంతో మృతికి ఆసుపత్రి వైద్యులే కారణమంటూ కుటుంబసభ్యులు ఆదివారం నగరంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. నందికొట్కూరుకు చెందిన షేక్ ఆసియా (36)కు గర్భ సమస్యలు ఉండటంతో గర్భం తీయించుకునేందుకు ఈ నెల 14వ తేదీన ఆమె ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరింది. వైద్యులు ఆమెకు మరుసటి రోజు ఆపరేషన్ చేసి గర్భం తొలగించారు. అయితే ఆ తర్వాత ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడే కొన్నాళ్లపాటు ఐసీయూలో ఉంచి చికిత్స చేశారు. పరిస్థితి విషమించడంతో పక్కనే ఉన్న మరో ప్రైవేటు ఆసుపత్రిలో ఆమెను చేర్చారు. అక్కడ కూడా ఆమె పరిస్థితి మెరుగు పడటకపోవడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆమె ఈ నెల 18వ తేదీన మరణించింది. ఆమె మృతికి కారణం కొత్తబస్టాండ్ సమీపంలోని హాస్పిటల్ వైద్యులేనంటూ ఆదివారం కుటుంబసభ్యులు ఆందోళన చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగించే ప్రయత్నం చేశారు. దీంతో ఆందోళన విరమించి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఘనంగా మధ్వ నవమి వేడుకలు

● హంస వాహనంపై దర్శనమిచ్చిన శ్రీవారు



ప్రత్యేక అలంకారంలో శ్రీహరి



మధ్వాచార్యుల పూజల్లో బ్రాహ్మణ సంఘం సభ్యులు



సంగీత కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరి హర క్షేత్రంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మధ్వ నవమిని పురస్కరించుకొని ద్వైత సిద్ధాంతం గురువు మధ్వాచార్యులు విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అంతకు ముందు ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష అర్చనలు, మహా మృత్యుంజయ, ధన్వంతరి హోమాలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు హంస వాహనంపై పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఆధ్యాత్మికం

విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. హైకోర్టు జీపీ రఘువీర్ పూజల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ శారదా సంగీత నృత్య కళాశాల గురువు కిరణ్ సంగీత కచేరి అలరించింది. కార్యక్రమంలో కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్ శర్మ, కార్యదర్శి హెచ్‌కే రాజశేఖర్‌రావు, గౌరవ సలహాదారులు హెచ్‌కే మనోహర్‌రావు, సంఘం కార్యవర్గ సభ్యులు బాల సత్యనారాయణ, శ్రీనాథ్, విజయ భాస్కర్, దుర్గాప్రసాద్, రామ మనోహర్, ఉమేష్, కేవీ సుబ్బారావు, వాయుసేన సేవాదళ్, మహిళా సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

జీవితానికి మార్గదర్శకం భగవద్గీత

కర్నూలు కల్చరల్: మాఘ భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో ఆదివారం సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గీతాప్రచార సంఘం ఆధ్వర్యంలో వివిధ ధార్మిక సంస్థల సమన్వయంతో ఆ సంఘం సభ్యులు సామూహికంగా కలసి 701 శ్లోకాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు డీవీ రమణ మాట్లాడుతూ ఉత్తమ మానవ జీవితానికి భగవద్గీత మార్గదర్శనం చేస్తుందన్నారు. జీవితంలో ఎదురయ్యే అన్ని సవాళ్లకు పరిష్కారం చూపుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. భగవద్గీత వ్యాప్తికి అన్ని విద్యాసంస్థలు, ధార్మిక సంస్థలు, దేవస్థానాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం సభ్యులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మహోన్నతం హిందూ ధర్మం

కర్నూలు కల్చరల్: హిందూ ధర్మం మహోన్నతమైందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ బాధ్యులు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు భగవద్గీత పఠనం చేయాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



జగన్నాథ మందిరం.. భగవద్గీత తరగతుల్లో భక్తులు



సంకల్‌బాగ్.. భగవద్గీత సామూహిక పారాయణం చేస్తున్న ధార్మిక సంస్థల సభ్యులు

కమనీయం కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ ఛాయా ఉష దేవి సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. రాజశ్యామల నవరాత్రుల ముగింపు వేడుకను పురస్కరించుకొని రాజశ్యామల హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహా మంగళ హారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



సూర్యనారాయణస్వామి కల్యాణ దృశ్యం



స్వామి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

■ముగిసిన రాజశ్యామల నవరాత్రులు



రాజశ్యామల హోమంలో భక్తులు



ప్రత్యేక అలంకారంలో రాజశ్యామల అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న రాజశ్యామల నవరాత్రుల వ్రతాలు తొమ్మిదో రోజు ఆదివారం ముగిశాయి. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేకంగా విశేష పూజలు, భజనలు నిర్వహించారు. పూర్ణాహుతితో పూజలు ముగిశాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి మాట్లాడుతూ వివేకం మేధస్సు, విజ్ఞానం అనుగ్రహించే శ్రీ రాజశ్యామల అమ్మవారి నవరాత్రులు నిర్వహించడం ఎన్నో జన్మల పుణ్య ఫలం అన్నారు. పారిశ్రామిక వేత్త టీజీ భరత్, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు మద్దిలేటి, గంగపుత్ర సంఘం నాయకులు రమణ, మధు, లలితా సంఘం అధ్యక్షులు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ, లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కురువలను చట్టసభలకు పంపించండి



సమావేశంలో మాట్లాడుతున్న రామక్రిష్ణ

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కురువలను చట్టసభలకు పంపించేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు చర్యలు చేపట్టాలని కురువ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామక్రిష్ణ కోరారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక శాతం కురువల జనాభా ఉన్నా, ఆయా రాజకీయ పార్టీలు కురువలను స్థానిక సంస్థలకు మాత్రమే పరిమితం చేశాయన్నారు. కురువల్లో ఎంతో మంది విద్యావంతులు ఉన్నారని, అలాగే రాజకీయాలపై ఆసక్తి, ప్రజలకు సేవ చేయాలనే గుణం కలిగి ఉన్నారన్నారు. చట్టసభలకు వెళ్లేందుకు అన్ని అర్హతలు ఉన్నా, ప్రధాన రాజకీయ పార్టీలు అవకాశం కల్పించక పోవడం వల్ల జిల్లాలో కురువలు రాజకీయంగా ఎదగలేక పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరగనున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని రాజకీయ పార్టీలు కురువలకు ఒక పార్లమెంట్, రెండు శాసనసభ స్థానాలు కేటాయించాలని కోరారు. సమావేశంలో నాయకులు మదనపల్లి వెంకటేష్, సురేష్, రంగన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ

కర్నూలు (న్యూటౌన్): అశ్లీలత ప్రతిఘటన వేదిక ప్రచురించిన ఈదర గోపీచంద్ సంపాదకత్వంలో వచ్చిన 'కామోత్సవ దహనం, విషపుతేలు పుస్తకాలను స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం జేవీవీ జాతీయ నేత మహమ్మద్‌మియా అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ గ్రంథాలయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, తెలుగు భాషా వికాసోద్యమకారులు జేఎస్ఆర్‌కే శర్మ హాజరై మాట్లాడుతూ 36 ఏళ్ల క్రితం నాటి అశ్లీల సినిమాలు, సీరియల్స్, తిరునాళ్ల నృత్యాలు, టీవీ ప్రోగ్రాంలపై అవిశ్రాంతంగా అనేక సంఘాలు పోరాటమే ఆధునిక సాంఘిక సంస్కృతికరంగ సంస్కరణోద్యమంలో ఒక ఉజ్వల ఘట్టమని కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు కె. శేషాద్రిరెడ్డి, గాయకుడు అంకయ్య, ప్రొఫెసర్ శివశంకర్, రచయితలు మోహన్, హైదర్, సోమన్న, రామలక్ష్మయ్య, హరికిషన్ పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సముద్రంలో మినరల్ బ్లాక్స్ గుర్తింపుపై వర్క్‌షాప్

కర్నూలు(న్యూటౌన్): ఈ నెల 15, 16వ తేదీల్లో కర్ణాటక రాష్ట్రం మంగళూరులో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎల్ కాంతారావు అధ్యక్షతన సముద్రంలో మినరల్ బ్లాక్స్ ఎలా గుర్తించాలన్న దానిపై వర్క్‌షాపు నిర్వహించారు. ఏపీ ప్రతినిధిగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ హాజరై సముద్రంలో మినరల్ బ్లాక్స్‌ను ఎలా గుర్తించాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని సముద్రతీరంలో 35 బ్లాక్స్‌ను సిద్ధం చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు వెల్లడించారు.

రేపు పెద్దాసుపత్రిలో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్ట్రోక్ (పక్షవాతం) యూనిట్ ప్రారంభం కానుంది. ఈ నెల 21వ తేదీన న్యూరాలజీ విభాగంలో దీనిని ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 12 పడకలతో నిర్మించిన ఈ ఐసీయూ విభాగం 24 గంటల పాటు సేవలందిస్తుంది. ఇందులో నిత్యం న్యూరాలజిస్టులు అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇందులో వెంటిలేటర్లు, సక్షన్ ఆపరేటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, మల్టీ చానల్ పంప్స్, ఇన్‌ఫ్యూజన్ పంప్స్, డీ ఫిబ్రిలేటర్లు ఏర్పాటు చేశారు. స్ట్రోక్ యూనిట్ ప్రారంభమైతే ఆసుపత్రిలోని ఏఎంసీ విభాగంపై భారం తగ్గుతుంది. ప్రస్తుతం స్ట్రోక్ బాధితుల్లో పరిస్థితి తీవ్రంగా ఉన్న వారిని ఎక్కువగా ఏఎంసీలోనే ఉంచి చికిత్స చేస్తున్నారు. ఈ కారణంగా ఇతర రోగులకు అత్యవసర పరిస్థితి ఏర్పడితే పడకల కొరత ఏర్పడుతోంది. స్ట్రోక్ యూనిట్ ఏర్పాటైతే ఇకపై ఇలాంటి ఇబ్బంది ఉండదు. దీంతో పాటు క్యాజువాలిటీలో చికిత్సకు వచ్చే రోగులను ఆయా విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండి పర్యవేక్షణ చేసి వారి విభాగాల్లో అడ్మిట్ చేసుకునేలా ఆదేశాలు జారీ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం

కర్నూలు సిటీ: డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన వి.పెద్ద నాగన్న, వెంకట లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వి.రాము యాదవ్‌కి శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ తెలుగులో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇతను రాయలసీమ ప్రాంతంలోని పురావస్తు మ్యూజియంలు ఎంపిక చేసిన హిందూ రాతి శిల్పాలపై అధ్యయనం చేశారు. ఆచార్య జి. వెంకట రామయ్య పర్యవేక్షణలో చేసిన ఈ పరిశోధనకు శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వీసీ టి.కిషన్‌రావు, బట్టు రమేష్ పీహెచ్‌డీ పట్టా అందించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతకు పలువురు మిత్రులు, కుటుంబ సభ్యులు ఆదివారం అభినందనలు తెలిపారు.

మానసిక ప్రశాంతత అవసరం

● షిరిడీ సాయికి వెండి మకర తోరణం అలంకరించిన జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు కల్చరల్: ప్రతి మనిషికి మానసిక ప్రశాంతత చాలా అవసరమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. ది కర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాఘవేంద్ర నగర్‌లోని బుద్ధా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో దక్షిణా మూర్తి స్వరూప శ్రీ షిరిడీ సాయిబాబా వారికి వెండి మకర తోరణం, సింహాసనం అలంకరణ మహోత్సవం జరిగింది. కలెక్టర్‌తో పాటు విశ్రాంత కలెక్టర్ జి.బలరామయ్య, సొసైటీ అధ్యక్షుడు పిరమిడ్ బ్రహ్మర్షి డాక్టర్ బి.వి.రెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య సాయినాథునికి ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ద్యానం అవసరమన్నారు. మనిషి నిత్యం సమస్యల్లో కొట్టుమిట్టాడుతుంటాడన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి బీవీ రెడ్డి ఆధ్యాత్మిక ప్రశాంతతకు అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. బలరామయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జీవితంలో ఏదో ఒక మార్గం ఎన్నుకోవాలన్నారు. ఎంచుకున్న మార్గంలో ప్రశాంతంగా పని చేసుకోడానికి ధ్యానం ఉపయోగ పడుతుందన్నారు. బీవీ రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం కర్నూలులో మొదటి పిరమిడ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పత్రీజీ సహకారంతో ప్రపంచ వ్యాప్తంగా పిరమిడ్ ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అవి ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ప్రముఖ వైద్యులు మాలకొండయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఐలా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సృజన, తదితరులు

విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: నగరశివారులోని జూనియర్ కాలేజీలో ఇర్ఫాన్ ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు పేరుతో విద్యార్థిని వేధించడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. తక్షణమే అధికారులు కాలేజీ గుర్తింపును రద్దు చేసి, ఇర్ఫాన్ తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ధర్నాలో విద్యార్థి తల్లిదండ్రులు, సంఘాల నాయకులు రంగప్ప, అబ్దుల్లా, సోమన్న, షాబీర్, పట్నం రాజేశ్వరి, విజయలక్ష్మి, అమర్ సాయి, ఉదయ్, అబుబక్కర్, యోగి మల్లేష్, మునిస్వామి,అశోక్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

- వచ్చే విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపు
- ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ల ఆహ్వానం
- మార్చి 14వ తేదీన దరఖాస్తుకు తుది గడువు



తరగతిగదిలో విద్యార్థులు

ఆలూరు రూరల్: విద్యా హక్కు చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయం పేద విద్యార్థులకు వరంగా మారనుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేటు పాఠశాలలు ఈ మేరకు వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. పాఠశాలల్లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన విద్యార్థుల జాబితా విద్యాశాఖ విడుదల చేసింది. ఎంపికైన విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలు ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు అర్హులు ఈ పథకానికి అర్హులు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించిన యాజమాన్యాలపై విద్యాశాఖ చర్యలు తీసుకోనుంది.

పక్కాగా అమలు

గత టీడీపీ ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసింది. నిబంధనల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాల్సి ఉండగా ఎక్కడా అమలుకు నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్యనందించేందుకు 2022–23 విద్యా సంవత్సరంలోనే శ్రీకారం చుట్టింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ప్రభుత్వమే ఎంపిక చేస్తోంది. 2023–24 ఏడాది ప్రైవేటు పాఠశాలల్లో విద్యాభ్యాసానికి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రవేశాలు కల్పించారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించారు. స్వీకరించిన దరఖాస్తుల్లో రిజర్వేషన్లు, నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లు కేటాయించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు సమాచారం ఇచ్చి ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేశారు.

2024–25 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఏటా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించాలని ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు ఇచ్చే అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై ఏటా అర్హులైన పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్ పొంది చదువుకునే అవకాశం కల్పించేలా ఇప్పటినుంచే చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలవుతున్న ప్రైవేటు పాఠశాల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది.

షెడ్యూల్ ఇలా..

- → అభ్యర్థులు http://cse.ap.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- → ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు విద్యార్థుల వివరాల నమోదుకు అవకాశం కల్పించారు.
- → మార్చి 20 నుంచి 22 వరకు విద్యార్థుల దరఖాస్తు అర్హతపై చెక్ చేసుకోవచ్చు.
- → ఏప్రిల్ 1న లాటరీ పద్ధతి ద్వారా మొదటి విడత జాబితా విడుదల చేస్తారు
- → ఏప్రిల్ 2 నుంచి 10వ తేదీ వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థులకు అడ్మిషన్ ప్రక్రియ జరుగుతుంది.
- → ఏప్రిల్ 15న లాటరీ పద్ధతి ద్వారా రెండవ జాబితా విడుదల
- → ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో ఎంపికైన విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

పేద విద్యార్థులకు వరం



విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇది పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఒక వరం. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి విడుదలైన నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, హెచ్ఐవీ బాధితుల పిల్లలు అర్హులు. – కోమలాదేవి, ఎంఈఓ, ఆలూరు.

25న వృషభాల బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల కేంద్రంలో మద్దమాంబ జాతర పురస్కరించుకొని ఈనెల 25వ తేదీన జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి న్యూ కేటగిరీ ఒంగోలుజాతి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. విజేత వృషభాల యజమానులకు ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు బ్రదర్స్ మొదటి బహుమతి రూ.60,116, కోడుమూరు కేశవులు, గొడుగువేణు రెండవ బహుమతి రూ.40 వేలు, మైత్రి స్కూల్ ఆనంద్‌రావు మూడవ బహుమతి రూ.30 వేలు, శ్రీకృష్ణయూత్ నాల్గవ బహుమతి రూ.20 వేలు, కవిరెడ్డి రామాంజనేయులు ఐదవ బహుమతి రూ.10,116, ఆకుల ఖాజావలి ఆరవ బహుమతి రూ.5116 అందించనున్నట్లు చెప్పారు. పోటీల రోజున కిట్టి, నాగేష్, శ్రీరాములు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసక్తిగల వారు 25వ తేదీ ఉదయం 7:30 గంటల్లోపు పేరు నమోదు చేయించుకోవాలని, వివరాలకు 98494 09827 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

25న చిట్యాలలో..

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో లాలూస్వామి ఉరుసు సందర్భంగా ఈ నెల 25న రాష్ట్ర స్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వృషభాల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. పేర్ల నమోదుకు 77026 30416, 99890 28249 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

రాజగోపురానికి భూమిపూజ

ఓర్వకల్లు : మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో రాజగోపుర నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు.